## ఆర్‌ఒ ప్లాంట్‌కు పసుపురంగు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

నారాయణపురం సచివాలయం-2 పక్కనే పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్‌ఒ ప్లాంట్‌ను టిడిపి నాయకులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు వైసిపి రంగులతో ఈ ఆర్‌ఒ ప్లాంట్‌కు పసుపు రంగులేని ముస్తాబు చేశారు. గ్రామాధ్యక్షుడు సప్ప వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్‌కు పసుపు రంగు వేసిన టిడిపి నాయకులు

# మంత్రులు అయ్యేదెవరో..!

- రెండు జిల్లాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- ప్రముఖంగా పితాని, రామానాయుడు పేర్లు
- రఘు రామకృష్ణంరాజుకు స్పీకర్ పదవి అంటూ ప్రచారం
- బిజెపి కోటాలో కామినేనికి దక్కే అవకాశం
- ఎవరికి వారు కీలక నేతలతో ముమ్మర ప్రయత్నాలు



పితాని సత్యనారాయణ



నిమ్మల రామానాయుడు



కె.రఘురామకృష్ణంరాజు



కొలుసు పార్థసారథి

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఎన్నికల పర్వం ముగిసింది. అఖండ మెజార్టీతో టిడిపి కూటమి విజయకేతనం ఎగురవేసింది. రెండు జిల్లాల్లోని 14 స్థానాలను కూటమి క్లైవసం చేసుకుంది. ఈ నెల 12న సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలుస్తున్నారు. అదేరోజు ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు ఎవరనేదానిపై తీవ్ర చర్చ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధారంగా మంత్రి పదవులు కేటాయిస్తారా.. లేక విభజిత ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవులు కేటాయింపు ఉంటుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈసారి టిడిపిలో గెలుపొందిన ఎంఎల్‌ఎ అభ్యర్థుల్లో సీనియర్లు ఉండటంతోపాటు, పొత్తులో జనసేన, బిజెపి సైతం ఉన్నాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి మంత్రి పదవుల కేటాయింపు ఎలా ఉంటుందనే దానిపై పడింది. ఇప్పటికే ఆశావాహులంతా అధినాయకులకు దగ్గరగా ఉండే నేతలను కలిసి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన పితాని సత్యనారాయణ పేరు మంత్రివర్గరేసులో ప్రముఖంగా విన్పిస్తోంది. ఈయనకు శెట్టిబలిజ సామాజిక తరగతి కోటాలో అవకాశం దక్కనున్నట్లు చెబుతున్నారు. ఈ సామాజిక తరగతిలో గెలిచిన ఎంఎల్‌ఎల్లో పితాని సత్యనారాయణ అత్యంత సీనియర్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పితానికి మంత్రి పదవి ఖాయమనే ప్రచారం సాగుతుండటంతోపాటు ఆయనకు బిసి వెల్ఫేర్ శాఖ కేటాయించనున్నట్లు చర్చ సాగుతోంది. గత టిడిపి ప్రభుత్వంలో పితాని కార్మికశాఖ మంత్రిగా పని చేశారు. కాపు సామాజిక తరగతి కోటాలో పాలకొల్లు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎంఎల్‌ఎగా గెలుపొందిన నిమ్మల రామానాయుడుకు మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి ఎదురొడ్డి ఆయన అనేక ఆందోళనలు చేసి జిల్లాలో పార్టీకి దిక్సూచిగా మారారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజారంగం పోరాడిన నేతగా రామానాయుడుకు మంచి పేరు ఉంది. ఎన్నికలకు ముందే టిడిపి గెలిస్తే రామానాయుడుకు మంత్రి పదవి ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. ఎందుకంటే గడిచిన పదేళ్లుగా ఆయన పార్టీ కోసం కష్టపడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రామానాయుడుకు మంత్రి పదవి ఇవ్వకపోతే జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి ఉంటుందనే చర్చ నడుస్తోంది. నరసాపురం ఎంపీగా పని చేసి ఈసారి ఎన్నికల్లో టిడిపి తరపున ఉండి ఎంఎల్‌ఎగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజుకు క్షత్రియ కోటాలో మంత్రి పదవి వరించనుందనే ప్రచారం సాగుతోంది. ఈయనకు మంత్రి పదవి ఇవ్వకపోతే శాసనసభ స్పీకర్ ఇవ్వనున్నట్లు మరో ప్రచారం నడుస్తోంది. అయితే ఈయన నామినేషన్‌కు కొద్దిరోజుల ముందు మాత్రమే టిడిపిలో చేరారు. జగన్‌కు ఎదురుతిరిగి చేసిన పోరాటం ఈయనకు కలిసొచ్చే అంశంగా కన్పిస్తోంది. రఘురామకృష్ణంరాజు మంత్రి పదవి లేదా స్పీకర్ ఏది జరుగుతుందో వేచి చూడాలి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఐదు స్థానాల్లో జనసేన పోటీ చేసింది. ఐదుచోట్ల ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారు. జిల్లాలో అన్ని సీట్లను టిడిపి కూటమి గెలుపొందడంలో కాపు సామాజిక తరగతి కీలక పాత్ర పోషించిందనే అభిప్రాయం ఉంది. జనసేన కోటాలోనూ జిల్లాకు ఓ మంత్రి పదవి వస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఒకవేళ వస్తే మత్స్యకారుల కోటాలో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు దక్కే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బిజెపి కోటాలో కైకలూరు నుంచి గెలిచిన కామినేని శ్రీనివాస్‌కు కచ్చితంగా మంత్రివర్గంలో అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మంత్రి పదవులు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కేటాయిస్తారా లేక విభజిత జిల్లాల ఆధారంగా కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉంది. నూజివీడు ఎంఎల్‌ఎగా గెలుపొందిన కొలుసు పార్థసారథి యాదవ సామాజిక తరగతి కోటాలో మంత్రి అయ్యే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. మంత్రి పదవులపై వేచియుంటారంతా ఆశలు పెట్టుకోవడంతో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొంది.

# చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం

**కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

దత్తత పత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - ఏలూరు**

చట్టబద్ధమైన దత్తత తీసుకోవడం ద్వారానే సహజంగా పుట్టిన బిడ్డలకు సంక్రమించే చట్టబద్ధమైన అన్ని హక్కులూ సంక్రమిస్తాయని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం మహిళాశిశు సంక్షేమ శాఖాధికారుల సమక్షంలో 11 నెలలు, నాలుగు నెలల పాపలను కర్నాటక రాష్ట్రానికి చెందిన తల్లిదండ్రులకు, తమిళనాడుకు చెందిన తల్లితండ్రులకు ఇద్దరు పిల్లలను దత్తత అందించి ఫైనల్ అడాప్షన్ ఆర్డర్‌ను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సదరు తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కారింగ్స్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాధాన్యతా క్రమంలో తమవంతు వచ్చినప్పుడు కోరిన పిల్లలను దత్తత తీసుకోవచ్చునని, ఏఒక్కరూ అక్రమ మార్గంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. దత్తత ద్వారా పిల్లలను తీసుకోవాలనుకునే వారు 'కారా' విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దత్తత తీసుకున్న పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారత అధికారి కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, డిసిపియు సిబ్బంది జాహ్నవి, రాజేష్ రాజ్‌కుమార్, శిశుగృహ సోషల్ వర్కర్ వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు**

జ్యూట్‌బ్యాగ్‌లు అందిస్తున్న వెంకటేశ్వరరావు, ప్రముఖులు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మానవ మనుగడ, అభివృద్ధి పర్యావరణంతో ముడిపడి ఉందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పవర్‌పేటలోని ఐద్వా భవనంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలవికాస్ భారతి స్వచ్ఛంద సంస్థ, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత పవర్‌పేట రైల్వే స్టేషన్ రోడ్డు, వాసు దేవాలయం ప్రాంతంలోని ప్రధాన రహదారుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ చెట్లు నాటాలని, ఇంట్లో-షాపుల్లో చెత్తను రోడ్లపై వేయరాదని, ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో ముఖ్య అతిథి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానవజాతి సుఖంగా బతకాలంటే ప్రకృతి సమతుల్యత ఉండాలని, ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు విజిఎంఆర్.కృష్ణారావు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల కాలంలో ఆక్సిజన్ కొరత వచ్చిందని, చెట్లు నరకడం వంటి మానవ తప్పిదాల వల్ల ఆక్సిజన్ కొరత ఏర్పడుతుందని అన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక వనాలను పెంచాలని కోరారు. సభాధ్యక్షులు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ ధరిత్రి అంటే మనుషులే కాదు జంతువులు, పశువులు, పక్షులు, మొక్కలు, చెట్లు, జీవ, నిర్జీవ పదార్థాల సమాహారమని అన్నారు. వాటన్నింటినీ సంరక్షించుకోవాల్సిన అవసరం మానవునిపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, బాలలకు, మహిళలకు పౌష్టికాహారం, జ్యూట్‌బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.కస్తూరిరావు, పోలవరపు దేవ రత్నాకర్, ఎం.అజయ్‌బాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, కార్యదర్శి ఎ.శ్యామలారాణి పాల్గొన్నారు.

# మంత్రి పదవి రేసులో నిమ్మల..!

**35 సంవత్సరాల తర్వాత పాలకొల్లుకు అవకాశం దక్కేనా**

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లు నియోజకవర్గానికి ఈసారైనా మంత్రి పదవి దక్కనుందా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు వరుసగా మూడోసారి ఎంఎల్‌ఎగా గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. పాలకొల్లు నుంచి 1989లో ఎంఎల్‌ఎగా ఎన్నికైన చేగొండి హరిరామజోగయ్యకు మంత్రి పదవి దక్కింది. ఆ తర్వాత ఆ ఊసే లేదు. మధ్యలో 2009లో ఇక్కడ నుంచి పోటీ చేసిన సినీనటుడు, పిఆర్‌పి అధ్యక్షుడు చిరంజీవిని ఓడించిన బంగారు ఉషారాణికి మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం సాగినా ఆ అవకాశం దక్కలేదు. ఈసారి నిమ్మలకు మంత్రి పదవి దక్కితే 35 సంవత్సరాల అనంతరం పాలకొల్లుకు మంత్రి పదవి దక్కినట్లవుతుంది. పాలకొల్లును ఆనుకుని ఉన్న నరసాపురం నియోజకవర్గంలో పలువురు మంత్రి పదవులు చేపట్టారు. నరసాపురంలో కాంగ్రెస్ హయాంలో పరకాల శేషావతారం, టిడిపి హయాంలో జోగయ్య, కొత్తపల్లి సుబ్బారాయుడు పలుమార్లు మంత్రి పదవులు నిర్వహించారు. ముదునూరి ప్రసాద్‌రాజు కూడా ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పని చేశారు. పెనుగొండ, ఆ తర్వాత ఆచంట నుంచి పితాని సత్యనారాయణ రెండుసార్లు మంత్రి పదవులు చేపట్టారు. అయితే పాలకొల్లుకు మాత్రం జోగయ్య తర్వాత మంత్రి పదవి దక్కలేదు. 1971లో పాలకొల్లు నుంచి ఎంఎల్‌ఎగా ఎన్నికైన జోగయ్య 1983లో టిడిపిలో చేరాక నరసాపురం నుంచి ఎన్నికై రాష్ట్ర హోం శాఖా మంత్రిగా పని చేశారు. 1988లో రంగా హత్యానంతరం కాంగ్రెస్‌లో చేరి 1989లో పాలకొల్లు నుంచి ఎంఎల్‌ఎగా ఎన్నికై రాష్ట్ర సమాచార, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. పాలకొల్లు నుంచి నాలుగుసార్లు ఎంఎల్‌ఎగా ఎన్నికైన అల్లు వెంకట సత్యనారాయణ మెగాస్టార్ చిరంజీవికి బంధువు కావడంతో టిడిపి హయాంలో మంత్రి పదవి దక్కుతుందని భావించినా మొండిచెయ్యే మిగిలింది. ఆగ్రోస్ ఛైర్మన్ పదవి అల్లుకు కట్టబెట్టారు.

ఇదిలా ఉండగా పాలకొల్లుకు చెందిన డాక్టర్ దాసరి నారాయణరావు కేంద్ర సహాయ మంత్రిగా పని చేశారు. పాలకొల్లులో ఎంఎల్‌ఎగా ఓడిన సినీనటుడు చిరంజీవి కేంద్ర టూరిజం శాఖ మంత్రిగా పని చేశారు. 2014 నుంచి వరుసగా ఎంఎల్‌ఎగా ఎన్నికవుతున్న నిమ్మలకు ఈసారి మంత్రి వర్గంలో చోటు ఖాయమనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. 2019లో రాష్ట్రంలో జగన్ ఘనవిజయం సాధించినా పాలకొల్లులో మాత్రం నిమ్మల 17,800 ఓట్ల మెజారిటీతో విజయబావుటా ఎగురవేశారు. ఆ కాలంలో అధికారపక్షాన్ని ధీటుగా ఎదుర్కొన్నారనే మంచి పేరుంది. ఈ నేపథ్యంలో నిమ్మల రామానాయుడు మంత్రి కావడం ఖాయమని టిడిపి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రధాని అవార్డుల ఎంపికకు రానున్న కేంద్ర బృందం

**సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలి : కలెక్టర్**



**ప్రజాశక్తి - ఏలూరు**

ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్స్-2023కు సంబంధించి అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ నెలలో జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్న కేంద్ర బృందానికి సమగ్ర సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో శ్రేష్ఠత కోసం ప్రధాన మంత్రి అవార్డులు-2023 ఎంపికలో భాగంగా జిల్లాలో కేంద్ర బందం పర్యటనపై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రబృందం క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అధికారుల నుంచి, సంబంధిత వ్యక్తిగత లబ్ధిదారుల ద్వారా సమాచారం సేకరిస్తుందన్నారు. జిల్లాలో సంబంధిత పథకాలకు సంబంధించి సమగ్ర వివరాలను, విజయగాధలను, ఫొటోలను సిద్ధం చేసుకోవాలన్నారు. అందుకు సంబంధించి పలు సూచనలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. ఆయా పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను స్పష్టతతో వివరించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఎన్‌వివి.సత్యనారాయణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శర్మిష్ట, డిఇఒ అబ్రహాం, ఎల్‌డిఎం నీలాద్రి, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.రాజు పాల్గొన్నారు.

# సంవత్సరంన్నరలోపు 'చింతలపూడి' పూర్తి

**ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్**

**ప్రజాశక్తి - చింతలపూడి**

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరంన్నరలోపు పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తనను గెలిపించిన చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానన్నారు. చింతలపూడి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అభివృద్ధిపై దృష్టి సారిస్తానని తెలిపారు. చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తానన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరించి, నగరం పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటి నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీపై ప్రత్యేక దృష్టి సారించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రిని అడిగి తీసుకొస్తానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

# ఘనంగా ఆర్‌ఎస్ 98వ జన్మదిన వేడుకలు

**ఆర్‌ఎస్ జీవితం స్ఫూర్తిదాయకం - సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం - కేక్ కట్ చేయించిన చించినాడ గ్రామస్తులు**



ఆర్‌ఎస్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు, సిపిఎం శ్రేణులు

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

98వ వసంతంలోకి అడుగుపెట్టిన సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని ఎఎస్‌ఆర్ నగర్‌లో సిపిఎం శ్రేణులు, చించినాడ గ్రామస్తులు, ప్రముఖులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలో ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ శివశంకర్ ఆర్‌ఎస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం విశాఖ నగర కార్పొరేటర్ బి.గంగారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ ఆర్‌ఎస్‌ను శాలువాతో సత్కరించారు. చించినాడ గ్రామస్తులు కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రజలందరిచేత, అన్ని రాజకీయ పార్టీల ద్వారా గుర్తింపు పొందిన నాయకుడు, పోరాట యోధుడు ఆర్‌ఎస్ అని కొనియాడారు. 1967-72 మధ్య నరసాపురం ఎంఎల్‌ఎగా సేవలందించారని గుర్తు చేశారు. జిల్లాలో మహిళలు, రైతులు, కార్మికులు, శ్రామికుల సమస్యలపై అనేక ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. 98 ఏళ్లు నిండినా నిరంతరం ఉద్యమాల పట్ల, ప్రజా సమస్యల పట్ల ఆలోచిస్తూనే అందరి ఆదరాభిమానం పొందిన నేత అని ప్రశంసించారు. ఆదర్శ ప్రజానాయకుడిగా, ప్రజాప్రతినిధులకే ఆదర్శప్రాయుడన్నారు. 98వ ఏట అడుగుపెట్టిన ఆర్‌ఎస్‌కు అభినందనలు తెలిపారు. ఆర్‌ఎస్ బలమైన కోరిక శత వసంతాలు పూర్తి చేసుకోవాలని, ఆయన అంతకు మించి ఎక్కువ వసంతాలు చేసుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కానేటి బాలరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, చించినాడ యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బ్యాంకుల్లో సర్వర్లు డౌన్

**పెన్షన్ సొమ్ము కోసం వృద్ధుల అవస్థలు**

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలో బ్యాంకుల వద్ద గురువారం పెన్షన్ సొమ్ము కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. దీనికితోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. మధ్యాహ్నం నుండి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం, సర్వర్లు పని చేయడంతో బతుకు జీవుడా అనుకుంటూ పెన్షన్ సొమ్ము తీసుకుని లబ్ధిదారులు వెనుదిరిగారు. బుధవారం వీచిన ఈదురు గాలులకు మండలంలో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడిన నేపథ్యంలో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పోలవరం స్టేట్‌బ్యాంకు, గూటాల కెనరా బ్యాంకుల్లో నామమాత్రపు సేవలందాయి.

**విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అధికారులు**

మండలంలో విద్యుత్ సరఫరా గురువారం మధ్యాహ్నానికి పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ డిఇ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెగిపడిన లైన్లు సరిచేశారు. 16 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, వాటన్నింటినీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని డిఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ కొండా సత్యనారాయణ, లైన్‌మెన్లు తగరపు రాజు, యల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయివేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

**విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్**



మాట్లాడుతున్న విద్యాధికారులు

**ప్రజాశక్తి - భీమడోలు**

మండల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు విద్యాబోధన, వారి ఆరోగ్య పరిరక్షణ, భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిబంధనలు పాటించాలని విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ కోరారు. పాఠశాలలు పున్ణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రయివేట్ పాఠశాలల పరిస్థితులను పరిశీలించేందుకు విద్యాధికారుల ఆధ్వర్యంలోని మండల విద్యాశాఖ బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలకు గల ప్రభుత్వ గుర్తింపు, అదనపు తరగతి గదుల ఏర్పాటు, వాటికి అనుబంధంగా కల్పించిన సౌకర్యాలు, భవనాలు - రక్షణ చర్యలు, ప్రభుత్వ అనుమతి పొందిన చోటే పాఠశాల నిర్వహణ, రికార్డుల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే క్రమంలో పాఠశాలలో అమలు చేయనున్న స్టేట్, సిబిఎస్‌సి, ఐసిఎస్‌సి - సిలబస్‌ల అమలుకు చేసిన ఏర్పాట్లు, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులతో పాటు సిఆర్‌పిలు సత్య ప్రసాద్, రమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# ఇగ్నోలో అడ్మిషన్లు ప్రారంభం

**సిఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ రామరాజు**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) జూలై 2024 విద్యాసంవత్సరానికి గాను వివిధ దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు ప్రకటన జారీ చేయడమైంది. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్స్, డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ కెఎస్‌సిహెచ్.శ్రీనివాసరావు, సిఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని, ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చుని, అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువు ఈనెల 30వ తేదీ అని తెలిపారు. వివిధ దూర విద్యా కోర్సులతో పాటు ఐదు రకాల ఎంబిఎ డిగ్రీలను ఇగ్నో అందిస్తుందని, సాధారణ బిఎతో పాటు ఎంబిఎ(హెచ్‌ఆర్), ఎంబిఎ(మార్కెటింగ్), ఎంబిఎ(ఫైనాన్స్), ఎంబిఎ(ఆపరేషన్స్) అనే ఈ ఐదు రకాల ఎంబిఎలకు ఎఐసిటిఇ గుర్తింపు ఉందని, ఈ ఐదు ఎంబిఎలు దూర విద్యావిధానంలో అందుబాటులో ఉన్నాయని, వీటిలో ప్రవేశానికి ఎటువంటి ప్రవేశ పరీక్ష అవసరం లేదని తెలిపారు. ఇంగ్లీషు సాహిత్యం, భాష, వేద విజ్ఞానం, వేద గణితం, సంస్కృతం, జ్యోతిష్యం, గ్రామీణాభివృద్ధి, జర్నలిజం, చేపల పెంపకం, డైరీ టెక్నాలజీ, అర్థ, వాణిజ్య శాస్త్రాలు, చరిత్ర, పర్యాటకం, పర్యావరణం, వైద్యం, విద్యారంగం ఇలా ఎన్నో రంగాలకు సంబంధించి ఇగ్నో కొత్తగా కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో విశాఖపట్నం, ఏలూరు(సర్ సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాల), విజయనగరం, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలలో ఉన్న ఇగ్నో అధ్యయన కేంద్రాల్లో పై కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఈ ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల కోడ్ ఎత్తివేత : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - ఏలూరు**

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గత మార్చి 16న అమలులోకి వచ్చిన కోడ్ ముగిసిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేసినట్లు తెలిపారు.

# ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవిజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిసాయి. గత 23 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, కోకో, మ్యూజికల్ చైర్ తదితర ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారిణిలు ఎం.శ్రీదేవి, జి.ఝాన్సీ బహుమతులు అందజేశారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు 'ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్' కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ డిఎల్‌టిసి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన' కింద 'ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్' కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పదో తరగతి, ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9493482414 నెంబర్లను సంప్రదించాలని రవి తెలియజేశారు.

## ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని కలెక్టరేట్ దగ్గరలో గల ప్రభుత్వ జిల్లా స్థాయి శిక్షణ (%govt. ITI/DLTC%)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరంనకు సంస్థలో సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థులు %https://iti.ap.gov.in website% ద్వారా ఈనెల 10 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కాలేజీ పని వేళల్లో ఆఫీస్ నందు 8332836944 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు అభినందనలు

### మండల జనసేన నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో టిడిపి కూటమి తరపున జనసేన ఎంఎల్‌ఎగా గెలుపొందిన చిర్రి బాలరాజును గురువారం జీలుగుమిల్లి మండలంలోని బర్రింకలపాడులో ఎంఎల్‌ఎ స్వగృహంలో మండల జనసేన నాయకులు అడపా నాగరాజు ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో కూటమి విజయానికి కృషి చేసిన జనసైనికులు, టిడిపి, బిజెపి నేతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎంఎల్‌ఎకు అభినందనలు తెలిపిన వారిలో శ్రీరామవరం, కృష్ణాపురం, కాపుగూడెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాలకు చెందిన నాయకులు ఉన్నారు.

## టిడిపి ఘనవిజయంపై సంబరాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి చారిత్రాత్మక విజయాన్ని సాధించడంలో కార్యకర్తలు, నాయకులు అందరి సహకారం వెల కట్టలేదని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం వీరాంజనేయులు సమక్షంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ కేకును కోయించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉంగుటూరు మండల నాయకులు పెద్ద సంఖ్యలో గన్ని ఇంటికి చేరుకున్నారు. తెలుగు మహిళా నాయకురాలు, మాజీ సర్పంచి అక్కిన నాగమణి, గురివెల్లి రాజారావు, నేకూరి ఆశీర్వాదం, పరిమి మాధవ, అక్కిన చిన్ని పాల్గొన్నారు.

## టిడిపి, జనసేన ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గ్రామాల్లో టిడిపి, జనసేన శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కూడలిలో ప్రసంగిస్తూ అధినేత పవన్ ఇచ్చిన పిలుపు మేరకు అందరూ సమన్వయంతో ఉండాలని, రాష్ట్ర అభివృద్ధికి మనవంతు సహకారం అందించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తాము అను నిత్యం వారి వెంట ఉండి సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేయాలని అన్నారు.

## నేరాలు - ఘోరాలు

## భర్తను హతమార్చిన భార్య

### వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే ఈ దారుణం

### ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - చింతలపూడి

అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని తన భర్తకు నిద్ర మాత్రలు ఇచ్చి, అనంతరం చున్నీ బిగించి చంపిన సంఘటన లింగపాలెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 1వ తేదీన లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన చట్టుమాల ఆశీర్వాదంకి భార్య సుమలత నిద్రమాత్రలు ఇచ్చి ఆయన రాత్రి గాఢనిద్రలో ఉండగా ప్రియుడు నాగరాజుతో కలిసి మెడకు చున్నీ బిగించి అతి దారుణంగా హత్య చేసినట్లు తెలిపారు. అనుమానం రాకుండ నిద్ర మాత్రలు మింగించి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారన్నారు. మృతదేహాన్ని అదే రోజున ఖననం చేశారన్నారు. మృతుడు తండ్రి ఏలియాకి తన కుమారుడి మృతిపై అనుమానం వచ్చి ఆయన ఈనెల 3న ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. ఏలియా ఇచ్చి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని గురువారం చింతలపూడి సిఐ సుధాకర్ సమాధి నుంచి వెలికి తీసి రీ పోస్టుమార్టం చేయగా అసలు సంగతి వెలుగులోకి వచ్చింది. భార్య సుమలత, అతడి ప్రియుడు నాగరాజు కోసం టీమ్స్ వెతుకుతున్నట్లు చింతలపూడి సిఐ తెలిపారు. తండ్రి ఏలియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అన్నారు.

## నడిరోడ్డుపై కత్తులతో దాడి

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో గురువారం ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్న సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది. పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ నడకుదుటి గిరీష్ కుమార్, నూకల సాయికృష్ణ, మూడు సుదీర్, నూకల అరుణ్‌కుమార్‌లు పాత కక్షల నేపథ్యంలో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి బాధితులను తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు విజయవాడ, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఈ దాడికి సంబంధించి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలోని తోట ఆంజనేయులు భార్య తోట లక్ష్మి తమకు ప్రాణహాని ఉందని ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బలివే గ్రామానికి చెందిన తోట ఆంజనేయులు, లక్ష్మి బలివే గ్రామంలో నివసిస్తున్నారు. ఆమె భర్త కార్ డ్రైవర్ కావడంతో ఉద్యోగరీత్యా విజయవాడ వెళ్లి వస్తూ ఉంటున్నారు. వీరు టిడిపికి అనుబంధంగా వ్యవహరించడంతో వైసిపికి చెందిన వారు వీరిపై కక్ష కట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. తనని, తన భార్యను భయపెట్టి బెదిరిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాముకాటుకు గురై యువకుడు మృతి

ప్రజాశక్తి - ముసునూరు

పాముకాటుకు గురై యువకుడు మృతిచెందిన సంఘటన కాట్రేనీపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ యాదవ్(29) తమ కుటుంబ సభ్యులతో కలిసి కాట్రేనీపాడు గ్రామంలోని కోళ్ల ఫారంలో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి సమయంలో రేకుల షెడ్డులో నివసిస్తూ ఉండగా, చీకటి సమయంలో కుడిచేతి చిటికని వేలుకు ఏదో కుట్టడంతో భయభ్రాంతులకు గురై ముసునూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. వారి సలహా మేరకు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, వారు పరిశీలించి మరణించినట్లు తెలపడంతో వారు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

## నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసార విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో నాటుసార విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో నాటుసార స్థావరంపై దాడి చేసి 10 లీటర్లు నాటుసార స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు ఆగేదెన్నడు..?

### గాంధీ కలలు కన్న స్వాతంత్రం నెరవేరేదెన్నడు!

ప్రజాశక్తి - మండవల్లి

మానవత్వం మంట కలిసిపోతుందా? రాక్షసత్వం పెచ్చరిల్లిపోతుందా? అంటే మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు చూస్తే నిజమే అనిపిస్తుంది. మహిళ అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే దేశానికి నిజమైన స్వతంత్రం వచ్చినట్లు అని మహాత్మా గాంధీ ఆనాడు అన్నట్లు నేడు మహిళలు కాదు కదా ముక్కుపచ్చలారని చిన్నారులు కూడా పట్టపగలే నిర్భయంగా తిరిగి రాలేని పరిస్థితి నెలకొంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ కాలంలో స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా, మగవారికి దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నా చిన్నారులు, బాలికలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిర్భయ చట్టం వంటి చట్టాలు ఉన్నా అత్యాచారాలకు అంతం ఉండటం లేదు. ఇదే కొనసాగితే తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రసవించేందుకు కూడా ఇష్టపడని పరిస్థితులు నెలకొంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాడు జరిగిన సంఘటనలు:** ముద్దు ముద్దు మాటలు పలికే ముక్కుపచ్చలారని చిన్నారిని తాతే అత్యాచారానికి పాల్పడిన సంఘటన ప్రత్తిపాడు శివారు చెరువుగట్టుపై చోటుచేసుకుంది. మైనర్ బాలికను అత్యాచారం చేసిన సంఘటన ఉనికిలిలో, నాలుగవ తరగతి చదువుతున్న బాలికపై వరుసకు అన్నయ్యతో పాటు మైనర్, ఒక మేజర్ కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన బిసి కాలనీలో, ఆకతాయిల వేధింపులు తట్టుకోలేక తొమ్మిదవ తరగతి చదివే మైనర్ బాలిక ఉరివేసుకొని చనిపోయిన సంఘటన చింతపాడులో, విద్య నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే బాలికలపై వేధింపులకు దిగిన సంఘటన లోకముడిలో, బాలికలను అల్లరి చేస్తూ, బైకులపై చక్కర్లు కొడుతూ ఢీకొట్టిన సంఘటనలో 10వ తరగతి విద్యార్థి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన సంఘటన జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చోటు చేసుకుంది. ఇలాంటి సంఘటనలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. కొంతమంది తల్లిదండ్రులు తమ కూతుర్ని అల్లరి పాలు చేసిన వాడు శిక్ష అనుభవించాలని ధైర్యంగా ముందుకు వచ్చినప్పటికీ ఆకతాయిలకు రాజకీయ బలం తోడవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈమధ్య కాలంలో జరిగిన సంఘటన:** స్నేహితురాలి పిలుపుమేరకు చింతపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ వద్దకు వచ్చిన బాలికను పాఠశాల గదిలోకి తీసుకువెళ్లి మైనర్ అత్యాచారం చేశాడు. మరో నలుగురు మేజర్లు వీడియోలను చిత్రీకరించి లొంగకపోతే యూట్యూబ్‌లో పెడతామని బాలికపై వేధింపులకు పాల్పడి లొంగకపోవడంతో వీడియోలను వాట్సాప్ ద్వారా షేర్ చేశారు. ఆ వీడియోలు తల్లి దృష్టికి రావడంతో కన్నీటి పర్యంతమైంది. బాలికను వివరాలు సేకరించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు పూర్తిస్థాయిలో విద్యకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెడు నడతలో యువత:** దేశ భవిష్యత్ యువత భుజస్కందాలపైనే ఉందంటారు. అయితే కొంతమంది యువత సెల్‌ఫోన్‌కు, మద్యం, గంజాయి వంటి దుర అలవాట్లకు అలవాటుపడి బానిసలుగా మారి ఉన్మాదిగా తయారవుతున్నారు. గ్రామాల్లో జులాయిగా తిరుగుతూ పాఠశాలల వద్ద, బాలికలు సంచరించే ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ, సందు దొరికితే బాలికలను ఆటపట్టిస్తూ అత్యాచారానికి పాల్పడుతున్నారు. బాలికల జీవితాలను నాశనం చేస్తూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు.

**బాలికను వేధించిన కేసులో రౌడీ షీటర్:** బాలిక అత్యాచారాన్ని సెల్ ఫోన్‌లో చిత్రీకరించి, లొంగకపోతే వీడియోలను యూట్యూబ్‌లో అప్లోడ్ చేస్తానని చింతపాడుకు చెందిన వ్యక్తిపై గతంలో మహిళలను వేధింపులకు పాల్పడిన సంఘటనలలో పలు కేసులు నమోదు అయ్యాయి. దీంతో అతనిపై రౌడీ షీట్ తెరిచారు. అయినప్పటికీ మరోసారి బాలికపై వేధింపులకు పాల్పడ్డాడు అంటే అతనిలో కరుడుగట్టిన రాక్షసత్వం ఏ స్థాయిలో ఉందనేది తేటతెల్లమవుతుంది. అత్యాచార నిందితులకు కఠిన శిక్ష పడినప్పుడే మహిళలకు, చిన్నారులకు రక్షణ ఏర్పడుతుందని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

### పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

**ఎస్ఐ రామచంద్రరావు**

పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వారి నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి, అతి నమ్మకం పెట్టుకోవడం అలాగని అనుమానించకూడదు. సెల్‌ఫోన్లు ఇచ్చి స్వేచ్ఛగా వదిలేయకుండా వారు ఎవరితో మాట్లాడుతున్నారు, ఏమేమి చూస్తున్నారు అనేది ఎప్పటికప్పుడు పరిశీలించాలి. విద్యార్థుల ప్రవర్తన ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగిస్తున్నాం. గ్రామాల్లో తల్లిదండ్రులకు, యువతకు అవర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నాం. చట్టాల గురించి వివరిస్తున్నాం.

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలారాణి**

నేరం చేసిన వాడు ఎంతటి వాడైనా భయపడేలా శిక్షలు ఉన్నప్పుడే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. అంతేకాకుండా చిన్నప్పటి నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిట్ అవడంతో పాటు ప్రభుత్వం మద్యాన్ని చదువుకునే యువతకు అందుబాటులోకి తీసుకురావడం ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నెట్ ద్వారా సెల్ ఫోన్‌లో వచ్చే నీలి చిత్రాలను చూసి చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా బరితెగించి బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలపై అధికారుల అలసత్వం కూడా ఉంది. నేరం చేసిన వాడికి కఠిన శిక్ష విధించినప్పుడే ఇటువంటివి పునరావృతం కాకుండా ఉంటాయి. మహిళలపై, బాలికలపై జరిగే అత్యాచారాలను అరికట్టేలా, సెల్ ఫోన్‌లో వచ్చే అశ్లీల దృశ్యాలను తొలగించే విధంగా జిల్లా ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిని అందిస్తాం.

## నాణ్యమైన విద్యాబోధనతో విద్యార్థులకు బంగారు భవిష్యత్

### అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ బి.శంకరరావు

బాలుర గురుకుల పాఠశాల అప్పలరాజుగూడెం

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాణ్యమైన విద్యాబోధన ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించడమే ప్రధాన లక్ష్యమని మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ బి.శంకరరావు తెలిపారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, నూటికి నూరు శాతం పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రగతిపై ప్రజాశక్తితో పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడారు. 1983లో స్థాపించబడిన బాలుర గురుకుల పాఠశాల జిల్లాలో ఏకైక బాలుర పాఠశాల అని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారికి మంచి భవిష్యత్తుకు పునాది వేయడం జరుగుతుందని శంకరరావు తెలిపారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, కొందరు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీర్, టీచర్స్ వంటి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని ఆయన తెలిపారు. పూర్వ విద్యార్థుల, దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయగలిగామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 'పది' ఫలితాల్లో 72 మందికి 72 మంది నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా, 584 మార్కులు సాధించి తిరుమల్లి జగన్నాథం మండల ప్రథమ స్థానంలో నిలిచారని, 52 మంది వరకూ 500లకు పైగా మార్కులు సాధించిన ఘనత పాఠశాలకు, సిబ్బందికి దక్కుతుందన్నారు.

పాఠశాలలో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకూ మొత్తం 480 మంది విద్యార్థులు ప్రతి ఏడాది ఎంట్రన్స్ పరీక్ష ద్వారా 5వ తరగతిలో ప్రవేశం పొంది, ఇంగ్లీషు మీడియంలో విద్యను అభ్యసిస్తుండగా వారికి ఉత్తమ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు ఉచిత వసతి, నాణ్యమైన భోజన సదుపాయాలు మెనూ ప్రకారం కల్పిస్తున్నామన్నారు. సౌకర్యవంతమైన భోజనశాలలు, తరగతి గదులు, చక్కని లైబ్రరీ, విశాలవంతమైన ఆటస్థలం, పరిశుభ్రతతో కూడిన టాయిలెట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతిరోజూ యేగా, మెడిటేషన్, వ్యాయామం, యాక్షన్ రోల్ ప్లే చేయిస్తుంటామన్నారు. సాయంత్రం క్రికెట్, రన్నింగ్, ఖోఖో, కబడ్డీ వంటి పలు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి పిఇటి ద్వారా వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అలా తర్ఫీదు పొందిన వారిలో రాష్ట్ర స్థాయిలో హై జంప్, లాంగ్ జంప్‌లో నిలిచారని, నియోజకవర్గ స్థాయిలో షాట్ పుట్, కబడ్డీ, యోగా వంటి క్రీడల్లో రాణించారని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.20 నిమిషాల వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. భోజన విరామం తరువాత 2.30 నుంచి 4.30 వరకూ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పుస్తక పఠనం ఉంటుందన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అర్థవంతంగా భోదించి వారిని మళ్లీ మళ్లీ చదివించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకునే విధంగా అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతోందని, అంతే కాక కల్చరర్ యాక్టివిటీస్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. అనారోగ్య పరిస్థితులు ఏర్పడితే వారిని సిక్ రూంలో ఉంచి వైద్య సదుపాయాలు అందిస్తామని చెప్పారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయులు అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధన వినియోగించుకుని విద్యార్థులు చక్కటి ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా, మండల స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. గత ఏడాది పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 8 మంది ట్రిపుల్ ఐటీలో కూడా సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని, ఉపాధ్యాయులు అందిస్తున్న విద్యను క్రమశిక్షణతో నేర్చుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గురుకుల పాఠశాల కళా వేదిక

## డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సులలో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు కళాశాలకు విచ్చేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లు, సెమినార్ హాల్, వర్చువల్ డిజిటల్ తరగతి గదులు, లేడీస్ వెయిటింగ్ హాల్, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, ఫీల్డ్ విజిట్‌లు, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఉందన్నారు. అలాగే కళాశాలలో ఉచిత వైఫై సదుపాయం కలదు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థినులకు ఉచిత హాస్టల్ సదుపాయం ప్రారంభించడం జరిగింది. కళాశాలలో క్రమశిక్షణ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్ షిప్ సదుపాయం కలదు. అంకితభావం గల అధ్యాపక బృందం ఉందని, ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యను విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు.

## గాలి, వాన బీభత్సం

**ముదినేపల్లి:** ముదినేపల్లితో పాటు మండలంలో బుధవారం రాత్రి గాలి, వాన బీభత్సం సృష్టించాయి. బీకర గాలి, వానకు పలు రహదారులపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. భారీ వర్షానికి గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై నీరు నిలిచిపోయి పాదాచారులు, నివాసితులు ఇక్కట్లు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి వృద్ధులు, పిల్లలు తీవ్రఅవస్తలు పడ్డారు.

**మండవల్లి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో విస్తారమైన వర్షం కురిసింది. బుధవారం రాత్రి ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై ఈదురుగాలులతో, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కుండపోతగా కురిసింది. దీంతో మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండవల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లే మార్గం లేకపోవడంతో జాతీయ రహదారి అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంతో వర్షపు నీటితో జాతీయ రహదారి చెరువులను తలపించింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దళిత వాడ, బిసి కాలనీ, కైకలూరు సందు పల్లపు బజారు వర్షపు నీటితో పూర్తిగా జలమయం అయ్యాయి.

## ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**ఏలూరు:** కృష్ణా జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్ (పర్సనల్ అసిస్టెంట్)లను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణా జిల్లా జడ్జ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని, నెలకు రూ.18,500 వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ అర్హత కలిగిన వారు లేని ఎడల, ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్‌లో లోయర్ గ్రేడ్ అర్హత కలిగిన వారిని పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుందన్నారు. జులై, 1 2024 నాటికి వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల లోపు కలిగి ఉండాలని, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు వారికి 5 సంవత్సరాలు, విభిన్నప్రతిభావంతులు, మాజీ సైనికోద్యోగులకు 10 సంవత్సరాలు వయస్సు సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను, సంబంధిత ధ్రువీకరణ పత్రాల నకళ్లను జతచేసి వచ్చేనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్, కృష్ణా జిల్లా మచిలీపట్టణం వారికి పంపాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో అర్హత కలిగిన వారికి ముందుగా స్కిల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, స్కిల్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. నిబంధనలు, తదితర వివరాలు జిల్లా కోర్ట్, మచిలీపట్నం వెబ్ సైట్, కృష్ణా జిల్లా, ఎన్‌టిఆర్, ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, ఎంప్లాయిమెంట్ కార్యాలయాలు, జిల్లా పౌర సంబంధాధికారి కార్యాలయాలు, జిల్లా కోర్ట్, మచిలీపట్టణం నోటీసు బోర్డులలో ప్రదర్శనలో ఉంచడం జరిగిందని కృష్ణా జిల్లా జడ్జ్ తెలిపారు.

## టిడిపి కూటమి గెలుపుపై హర్షం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పాటు ఏలూరు పార్లమెంట్ స్థానాన్ని సైతం టిడిపి కూటమి అభ్యర్థులు గెలుపొందడంపై తెలుగు యువజన జిల్లా నాయకుడు గణేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఏలూరులోని టిడిపి ఎంపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేశారన్నారు. యువతకు ఉద్యోగ కల్పన చేసే విధంగా ఉంగుటూరు, పోలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తారన్నారు. ఎన్నికల సందర్భంగా ఎంపీ మహేష్ యాదవ్ ఇచ్చిన హామీల ప్రకారం ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి, అదేవిధంగా ఏలూరుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చే విధంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఒక్కో ఫ్యాక్టరీ స్థాపించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఏలూరు పార్లమెంట్ టిడిపి మహిళ అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాక్షస పాలనను అంతం చేసి ప్రజలకు సుభిక్ష పాలన అందించే చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని విజయలక్ష్మి అన్నారు. జిల్లాలో ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి రాధాకృష్ణ 62 వేల 384 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మద్దిపాటి వెంకట రాజు విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం నియోజకవర్గ టిడిపి ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట రాజు విజయోత్సవ ర్యాలీ ఈనెల 7న జరుగునని, మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ఉదయం 7:30కు ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో దర్శనం అనంతరం, మండలంలో విజయోత్సవ ర్యాలీ సాగుతుందన్నారు. కావున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల టిడిపి అధ్యక్షులు లంకా సత్యనారాయణ తెలిపారు.

## చిర్రి బాలరాజును కలిసిన ప్రగడపల్లి సర్పంచి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎగా గెలుపొందిన కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజుని తన స్వగృహం వద్ద గురువారం ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## నారా లోకేష్‌ను కలిసిన మోరంపూడి

ప్రజాశక్తి - చాట్రాయి

గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా గెలుపొందిన వారిని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు గురువారం అభినందించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి కొలుసు పార్థసారథి, మంగళగిరి ఎంఎల్‌ఎగా గెలుపొందిన నారా లోకేష్‌ను వారి నివాసానికి వెళ్లి అభినందించారు. వారిని మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. ఆయనతో పాటు మండలంలోని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయం

### బ్యాంక్ మేనేజర్ హనుమంతు భవాని

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇంతవరకూ దాతలకు మాత్రమే పరిమితమయ్యాయని, తాజాగా దీనిలో ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములు కావటం అభినందనీయమని సామాజిక కార్యకర్త శ్యామల రాజు అన్నారు. గుండుగొలను యూనియన్ బ్యాంక్ మేనేజర్ హనుమంతు భవాని తన భర్త దుప్పల శేషగిరిరావు జ్ఞాపకార్థం సేవా సమితి ద్వారా ప్రతినెల సేవలు పొందుతున్న 60 మంది వికలాంగులకు గురువారం భోజనం ఏర్పాటు చేశారు. వాటి పంపిణీ కార్యక్రమాన్ని సేవాసమితి సభ్యులు, కుటుంబ సభ్యులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ బ్యాంకు మేనేజర్ చేపట్టిన సేవలను అభినందించారు. ఇతర ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా అభివర్ణించారు.

## సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి సరియం రామ్మోహన్ ప్రచారంలో భాగంగా సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నాయకులు ధర్మల సురేష్ అన్నారు. గురువారం బుట్టాయగూడెం మండలం కెఆర్ పురంలో జరిగిన సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశం వెట్టి సుబ్బన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో సరియం రామ్మోహన్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన తర్వాత వచ్చిన ఓట్లు, ప్రచారం, ప్రజల సహకారాన్ని సమీక్షించుకోవటం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ధర్మలసురేష్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థిగా సరియం రామ్మోహన్‌ని పోటీలో పెట్టగానే పార్టీ కార్యకర్తలు వందలాది మంది అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేశారని, ఎండనక, వాననక విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత రైతులు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అభ్యర్థి రామ్మోహన్, పి.శ్రీనివాస్, కెవి రమణ, కె.రాఘవ, వెట్టి భారతి, పి.లత, ఇ.భూషణం, వి.సద్గురు, జి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

**ఒరిజినల్ పాసుపోర్ట్ పోయినది**

**గొట్టుముక్కల జయశ్రీ వల్లి D/o.** సత్యసూర్యనారాయణరాజు, డోర్‌నెం.1-93/1, ఆంజనేయ స్వామి గుడివద్ద, జక్కరం, కాళ్ళమండలం, పశ్చిమగోదావరి జిల్లా అనునేను తెలియ జేయునది ఏమనగా నా యొక్క నెం. W8073657 నెంబరు గల పాస్‌పోర్టు ది. 01.06.2024న తారీఖున పాస్‌పోర్ట్ జిరాక్స్ కొరకు ప్రస్తుతం నివాసం వుండున్న A.S.R నగర్ నుండి అడ్డవంతెన దగ్గరకు వస్తుండగా మార్గ మధ్యమంలో పాస్‌పోర్ట్ పెట్టిన కవరు జారిపడి పోయినది. నా యొక్క పాస్‌పోర్ట్ దొరికిన వారు దయచేసి పై అడ్రస్సుకు సంప్రదించగలరు

**గొట్టుముక్కల జయశ్రీ వల్లి**
D/o. సత్యసూర్యనారాయణరాజు, సెల్: 9912344196

**మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు**
**E.P. No. 55/2018 in O.S. No. 245/2008**

*Between:*

పులగం వెంకట సత్యనారాయణరెడ్డి
-డి. హెచ్. ఆర్./వాది

మరియు

పడవల శివన్నారాయణ (died) వగైరా
-జే. డి. ఆర్స్/ ప్రతివాదులు

*టు:*

శ్రీమతి పడవల లలితా భ్రమరాంబికా కుమారి, భర్త: శివన్నారాయణ, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావా డిక్రీ ప్రకారం నమూనా క్రియ దస్తావేజు ప్రకారం క్రియ దస్తావేజును వ్రాయించి రిజిష్టర్ చేయించి ఇప్పించగలందులకు కోరుతూ వారంటు అమలు గ్రంథమును పై డిక్రీ హోల్డరు దాఖలు చేయగా కోర్టు వారు మీకు Or. 21 Rl.22 నోటీసులు ఎన్నిమార్లు పంపించిననూ మీరు తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గ్రంథములో మీ పై పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంథములో మీరు **19-06-2024వ తేదీ ఉదయం గం।। 10.30 ని।।ల** నుండి స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనుటకు వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజున హాజరై అభ్యంతరములు తెలియజేసుకోవలెననిన్నీ, లేనిచో సదరు వారంటు అమలు గ్రంథము మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**సరిపల్లి రామ సత్తయ్య**
నర్సాపురం — అడ్వకేట్, నర్సాపురం
ది.06-06-2024 — సెల్: 9848837555